



# విజయభాను

విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు · Years of Excellence

విశాఖపట్నం, బుధవారం 17-05-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 205 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# స్వార్థ రాజకీయాల కోసమే నీచపు పొత్తులు

- వచ్చే ఎన్నికల్లో పొత్తులు,ఎత్తులు, కుయుక్తులనే నమ్ముకున్న బాబు, దత్తపుత్రుడు
- సీఎం పదవి వద్దంట, ప్యాకెజీ ఇస్తే చాలంట
- ఒక్క సీటు కూడా గెలవక ముందే.. కుట్రలు మొదలు
- వైయస్ఆర్ మత్స్యకార భరోసా నిదుల విడుదల సభలో సీఎం జగన్
- 1,23,519 మత్స్యకార కుటుంబాల ఖాతాల్లోకి రూ.123.52 కోట్లు జమ





నిజాంపట్నం/బాపట్ల జిల్లా (విజయభాను న్యూస్) : స్వార్థ రాజకీయాల కోసమే జనసేన టిడిపి నీచపు పొత్తులు పెట్టుకుంటున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దుయ్యబట్టారు.

నిజాంపట్నం సభ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష టీడీపీ, జనసేన పొత్తులు, కుట్ర రాజకీయాలపై విరుచుకుపడ్డారు అధికారంపై కాంక్షతో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొత్త అబద్ధాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారంటు విమర్శలు గుప్పించారు. చంద్రబాబు, తన దత్తపుత్రుడు పొత్తులు, ఎత్తులు, కూయుక్తలతో దిగజారి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐలతో కలిసిపోయి మ్యాచ్ ఫిక్సింగ్ కు పాల్పంది

తరువాయి 2లో..

# యువత ఉపాధి కోసమే రోజ్ గార్ మేలా

## కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్



సీతమ్మధార (విజయభాను న్యూస్) : యువత కు విస్తృతంగా ఉపాధి కల్పన కోసమే ప్రధాని మోడీ నాయకత్వంలో రోజ్ గార్ మేలా నిర్వహిస్తున్నారని కేంద్ర ఆర్థిక శాఖా సహాయ మంత్రి భగవత్ కిషన్ వెల్లడించారు. ఆయన నగరంలోని విద్యుత్ నగర్ లో గల పోర్ట్ స్టేడియం లో ఐదవ రోజ్ గార్ మేలాను మంగళ వారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మొత్తం 10 లక్షల మందికి ఉపాధి కల్పన ధ్యేయం అన్నారు. ఇందులో భాగంగా ఈరోజు దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో 71 వేల మందికి వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉపాధి నియామక పత్రాలు అంజేస్తున్నము అని తెలిపారు. దేశం రక్షణ, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందుతోంది అన్నారు. యువత ఉజ్వల భారత్ సాకారం దిశగా అడుగులు వేస్తుంది అన్నారు. దేశంలో 39 కోట్ల మందికి ముద్ర పథకం రుణాలు మంజూరు చేశామని గుర్తు చేశారు. అనంతరం ప్రధాని మోడీ వర్చువల్ విధానంలో ఢిల్లీ నుంచి ప్రసంగించారు. తరువాత అతిధుల చేతుల మీదుగా 400 మందికి ఉపాధి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ వీ. రాములు, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్, డీఆర్ ఎం అనూప్ కుమార్ సత్పతి, జీఎస్ ఐ డిప్యూటీ డైరెక్టర్ గుప్తా, రైల్వే, పోర్ట్, బీఎస్ఎన్ఎల్, ఐఐఎం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## జూన్ 4న కేరళకు నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్: ఈసారి కాస్త ఆలస్యంగా నైరుతి రుతుపవనాలు ఇండియాలోకి ఎంటర్ కానున్నాయి. జూన్ 4వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకనున్నట్లు ఇవాళ భారతీయ వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాలతో దేశవ్యాప్తంగా వర్షాలు కురవనున్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం భీకర రీతిలో హీట్‌వేవ్ కొనసాగుతున్న నేపథ్యంలో.. వర్షాకాలం కాస్త ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించనున్నట్లు తెలుస్తోంది. గడిచిన 18 ఏళ్ల నుంచి భారతీయ వాతావరణ శాఖ.. నైరుతి రుతుపవనాల గురించి అంచనాలు వేస్తోంది. 2015 మినహాయిస్తే దాదాపు 2005 నుంచి అన్ని అంచనాలు కరెక్ట్ అయ్యాయి.

# ఆశ్రమాలకు తల్లి లాంటిది గృహస్థాశ్రమము

## బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



సిరిపురం(విజయభాను న్యూస్) : గురజాడ కళాక్షేత్రంలో ధర్మ వర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గృహస్థాశ్రమ వైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుతో ప్రవచనములు మంగళ వారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన నగరవాసులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, అన్ని ఆశ్రమాలకు గృహస్తా శ్రమం తల్లి లాంటిది అన్నారు. ప్రపంచ దేశాలకు భారత దేశ గృహస్థ ఆశ్రమం ఆదర్శంగా వుంది అన్నారు. హృదయ బంధం శాశ్వతం అన్నారు. అందరూ ముందుగా కర్తవ్యం తెలుసుకోవాలి అన్నారు. పురాణాలు కల్పితం కాదు అని పేర్కొన్నారు. భక్తి ద్వారా నే దేవునిలో ఐక్యం అవుతారు అని పేర్కొన్నారు. ప్రజలు నిత్యం వేదాలు, భారతం, భాగవతం చదవాలి

తరువాయి 2లో..

# కౌలు రైతులకు బ్యాంకర్ల రుణాలు పెంచాలి

## రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో పాల్గొన్న డిప్యూటి సియం ముత్యాల నాయుడు



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : ప్రాధాన్యత రంగానికి బ్యాంకర్స్ ఇవ్వాల్సిన రుణాలు వాటి లక్ష్యాల కంటే తక్కువగా ఉన్నాయని, ప్రైవేట్ బ్యాంకులు రుణాలు తక్కువగా ఇస్తున్నాయని, కౌలు రైతులకు లోన్ పెంపు చేయుటకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా ఆశించిన స్థాయిలో ఫలితాలు ప్రైవేట్ బ్యాంకులు చూపించడం లేదని, డిప్యూటి చీఫ్ మినిష్టర్ ముత్యాల నాయుడు అన్నారు. విశాఖపట్నంలోని దసపల్లా హెూటల్ లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగత్ కిషన్ రావు కరాద్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో డిప్యూటీ సియం ముత్యాల నాయుడు పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలకి ఇస్తున్న రుణాలు, టిడ్కో హౌసింగ్ కి ఇచ్చే లోన్లు మరింత పెంపుదల చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఫైనాన్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శంషేర్ సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.



# మండుటెండను సైతం లెక్కచేయకుండా

# వార్డులో అభివృద్ధి పనులు

- విద్యుత్ తీగలకు అంతరాయం కల్గిస్తున్న చెట్లు కొమ్మలు తొలగింపు చర్యలలో పాల్గొన్న గంకల
- గుడ్ మార్నింగ్ గంకల ద్వారా సమస్యలు పరిష్కరిస్తూ రోల్ మోడల్ కార్పొరేటర్ గా గంకల కవిత అప్పారావు




కంచరపాలెం (విజయభాను న్యూస్): విశాఖ ఉత్తర నియోజకవర్గం 48వ వార్డులో వార్డ్ కార్పొరేటర్,జీవీఎంసీ భారతీయ జనతా పార్టీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తూ ప్రజలకు రోల్ మోడల్ కార్పొరేటర్ గా పేరు తెచ్చుకుంటున్నారు.గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన పిర్యాదు మేరకు మంగళవారం నాడు మండుటెండను సైతం లెక్కచేయకుండా శ్రీనివాస్ నగర్,జై భారత్ నగర్,జవహర్ లాల్ నగర్ ప్రాంతంలో జీవీఎంసీ హార్టికల్చర్ డిపార్ట్మెంట్ సిబ్బంది,ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ సిబ్బందితో కలిసి వార్డులో పర్యటన చేసి చెట్లు కొమ్మలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడ కుండా చెట్ల కొమ్మలను అధికారులతో కలసి చెట్ల కొమ్మల తొలగింపు చర్యలలో గంకల కవిత అప్పారావు పాల్గొని మధ్యాహ్నం భోజనం కార్యక్రమం కూడా కార్మికులతో కలసి రోడ్డు మీద భోజనం చేసి పనులలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగిపోవడంతో విద్యుత్తు వైర్లకు తాకడంతో ఆయా లైన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం జరుగుతుందని వచ్చిన పిర్యాదు మేరకు తక్షణమే జీవీఎంసీ హార్టికల్చర్ డిపార్ట్మెంట్ డిడి దామోదర్,మురళీనగర్ ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ తో సంప్రదించి వారికీ సమస్య వివరించి వారి ద్వారా ఈరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడ కుండా చెట్ల కొమ్మలను విద్యుత్తు లైన్లలో వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది,హార్టికల్చర్ సిబ్బంది సహాయంతో తొలగింపు పనులు చేపట్టారని తెలిపారు.ఈ నేపథ్యంలో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.ఆయా లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా యధావిధిగా అందించారని అన్నారు.ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన గుడ్ మార్నింగ్ గంకలలో ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వార్డ్ ప్రజల ఇబ్బందులపై పిర్యాదు అందించగానే తక్షణమే చర్యలు చేప్పట్టిన జీవీఎంసీ హార్టికల్చర్ డిపార్ట్మెంట్ డిడి దామోదర్,మురళీనగర్ ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ లకు గ్రామస్థుల తరుపున గంకల అభివాదం తెలిపారు.మండుటెండను సైతం లెక్కచేయకుండా వార్డులో అభివృద్ధి పనులలో పాల్గొని తమ సమస్య పరిష్కారం చూపిన కార్పొరేటర్ గంకల కవితా అప్పారావుకు శ్రీనివాస్ నగర్,జై భారత్ నగర్, జవహర్లాల్ నగర్ ప్రజలు రోల్ మోడల్ కార్పొరేటర్ గా అభినందనలు తెలిపారు.



# వై.యస్.ఆర్ మత్స్యకార భరోసా జమ చేసిన ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి

- విశాఖ జిల్లాలో 12,173 మంది లబ్ధిదారులకు రూ .10 వేలు చొప్పున జమ.
- జిల్లాలో మొత్తం రూ.12.17 కోట్ల జీవనభృతి పంపిణీ.




విశాఖపట్నం : వై.యస్.ఆర్. మత్స్యకార భరోసా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి నగదు జమచేశారు. వేట నిషేధం అమలులో ప్రభావితం కాబడిన కుటుంబాలకు మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ నుండి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డి 2023-24 ఏడాదికి సంబంధించి 5వ విడత వై.యస్.ఆర్ మత్స్యకార భరోసా ఆర్థిక సహాయం క్రింద ఒక్కో కుటుంబానికి 10 వేల రూపాయలు సంబంధిత మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ వేట నిషేధం (ఏప్రిల్ 15నుండి జూన్ 15వరకు రెండు నెలలు) అమలులో ప్రభావితం కాబడిన 12,173 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.10,000/- లు చొప్పున .12.17కోట్లు జీవన భృతి పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర మొత్తం 1,23,519 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.10,000/- లు చొప్పున ?.123.52 కోట్లు రూపాయలు ఆర్థిక సాయం మంజూరు చేసినందుకు జీవితాంతం మత్స్యకారులందరు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు జగమ్మోహన్ రెడ్డి గారికి రుణపడి ఉంటామని తెలియజేసారు. సముద్రం పై వేటకు వెళ్లే మత్స్యకారుల స్థితిగతులను మెరుగుపరిచి వలసలను అరికట్టే లక్ష్యంతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ లాండింగ్ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి కార్యక్రమం ప్రారంభించగా జిల్లాలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లాలో మత్స్యకార భరోసా క్రింద 12,17,30,000/- ల రూపాయల మెగా చెక్కును మత్స్యకారులకు అందజేశారు. జిల్లా నుండి ఈ కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి, శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్.ఎల్.సి వంశీకృష్ణా యాదవ్ , జాయింట్ డైరెక్టర్(ఫిషరీస్) విజయ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇంచార్జ్ పూర్ణిమ దేవి, ఫిషరీస్ వెల్ఫేర్ యండ్ డెవలప్మెంట్ డైరక్టర్ పి.విజయ చంద్ర , పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ పై అవహానర్యాలీ



యానం, విజయభాను : కేంద్ర పాలిత ప్రాంతం యానం నియోజకవర్గం పరిసర ప్రాంతాలు ప్లాస్టిక్ నిషేధించాలంటూ స్వచ్ఛంద సంస్థలతో పాటు వ్యాపారులు, అధికారులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నందు ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి చేతుల మీదుగా జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పురవీధుల గుండా ప్లాస్టిక్ నిషేధించాలంటూ ప్రకాడ్లు పట్టుకొని ఏఎన్ఎం, చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ప్రజల్లో చైతన్యాన్ని కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయిల్, యానం ఎస్సై నూకరాజు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పులవర్తిశ్రీనివాస్, విశ్రాంతి ఉపాధ్యాయులు దంగుడు బియ్యం సత్యనారాయణ, లైన్స్ క్లబ్ ప్రతినిధులు, ఇతర వ్యాపార సంస్థ ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సృజనాత్మకతకు నిలయం వేసవి వినోదం

కాకినాడ : జగన్నాథపురం ఎంఎస్ ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో వి.బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి వినోదం కార్యక్రమాన్ని ఉప తనిఖీ అధికారి ఎల్. గణేష్ బాబు మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్,వినోదం, విజ్ఞానం,ఆడుతూ పాడుతూ నేర్పేది వేసవి వినోదం అన్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకతకు నిలయం వేసవి వినోదం అన్నారు. మంచి కార్యక్రమంనిర్వహిస్తున్న వి.బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కె.సత్యనారాయణ కు అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని అభివృద్ది చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ వేసవి వినోదంలో 23 పాఠశాలల నుండి 87 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల కరస్పాండెంట్ పి.బాబూరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి సహకరిస్తాయి అని అన్నారు. వేసవి వినోదం కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 4 వ తరగతి నుండి 7వ తరగతి విద్యార్థులు జూనియర్స్ గాను 8వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులను సీనియర్స్ గాను విభజించి వివిధ అంశాలపై శిక్షణను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.శ్రీకృష్ణ సాయి విద్యార్థులకు అనేక సైన్స్ ప్రయోగాలపై శిక్షణను ఇచ్చారు.ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. పప్పెట్రి శిక్షకులు పిల్లి గోవింద రాజులు విద్యార్థులకు పప్పెట్రీ పై శిక్షణను ఇచ్చారు.ప్రతి విద్యార్థి వినూత్నంగా ఆలోచించాలని అన్నారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ తన హాస్య గుళికలతో విద్యార్థులకు వినోదాన్ని,విజ్ఞానాన్ని చిన్న చిన్న బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషను ఆటపాటలతో నేర్చుకోవాలి. పద్యాలు,గీతాలు,కథలు, కవితలు వంటి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఈశ్వర రావు,కె.దుర్గా ప్రసాద్,పి.దేవి, సిహెచ్.శ్రీహరి రావు నాయుడు,వి.పద్మావతి, కె.లక్ష్మణరావు,విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వార్థ రాజకీయాల కోసం నీచపు పొత్తులు..

బాబు, పవన్ అని ధ్వజమెత్తారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు పేరు చెబితే ఒక్కపథకం గుర్తు రాదని.. ఆయన పేరు తలిస్తే గుర్తుకొచ్చేది వెన్నుపోటేనని అన్నారు. పేదలకు మంచి చేయని ఈ వ్యక్తికి ఎవరైనా ఎందుకు మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో మత్స్యకార భరోసా సాయాన్ని జమచేశారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున మొత్తం 1,23,519 మంది మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద రూ.123.52 కోట్లతో పాటు ఓఎన్జీసీ పైపులైన్ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయిన 23,458 మంది మత్స్యకారులకు కూడా రూ.108 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎం జమచేశారు. ఇప్పటి వరకు రూ. 538 కోట్ల సాయం అందజేత.

**వెంటిలేటర్ పై బాబు పార్టీ.....**

చంద్రబాబు అధికారంలో ఉంటే అమరావతి.. అధికారం పోతే జూబ్లీహిల్స్ ఉంటాడని సీఎం జగన్ దుయ్యబట్టారు. ఏపీలో దోచుకుని హైదరాబాద్లో ఉండటం వీరి పని అని మండిపడ్డారు. అయితే ఏపీలోనే తన శాశ్వత నివాసం ఉందని.. తాడేపల్లిలో ఇళ్లు కట్టుకొని ఉంటున్నట్లు సీఎం పేర్కొన్నారు. ప్రధానులు, రాష్ట్రపతులను చేశానన్న పెద్ద మనిషికి ఒంటరిగా బరిలోకి దిగే దమ్ముందా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా చంద్రబాబుకు లేదని విమర్శించారు. చంద్రబాబుకు సభలు పెట్టే ధైర్యం కూడా లేదని, ఆయన పార్టీ వెంటిలేటర్పై ఉందని ఎద్దేవా చేశారు.

**చంద్రబాబు చెప్తే ప్యాకెజీ స్టార్ చిత్తం ప్రభు అని అంటారు....**

చంద్రబాబుకు ఏది మంచి జరిగితే అదే చేస్తానంటాడు దత్తపుత్రుడు. ఏ పార్టీని కలవాలో దత్తపుత్రుడికి చంద్రాబాబే చెప్తాడు. బాబు చెప్తే దత్తపుత్రుడు బీజేపీ పక్కన చేరతాడు. చంద్రబాబు బీజేపీకి విడాకులు ఇవ్వమంటే ఇచ్చేస్తాడు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 గజదొంగల ముఠా సభ్యులు. చంద్రబాబు, దత్తపుత్రుడు చక్రం తిప్పుతున్నారని రాస్తుంటారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే చంద్రబాబు గెలుపని పండుగా చేసుకుంటారు. కర్ణాటకలో ఓడిన బీజేపీని తమతో కలిసి రావాలని వీళ్లే కోరతారు. వీరు చేస్తుంది జగన్ తో యుద్ధం కాదు జనంతో యుద్ధం. వీరు చేస్తుంది రాజకీయ పోరాటం కాదు.. అధికారం కోసం ఆరాటం. పేదలకు మంచి చేయాలన్న తపన, తాపత్రయం వారికి లేదు.

**సీఎం పదవి వద్దంట, ప్యాకజీ ఇస్తే చాలంట.....**

'రెండు చోట్ల పోటీచేస్తే.. మాకు ఎమ్మెల్యేగా వద్దని రెండు చోట్లా దత్తపుత్రుడని ప్రజలు ఓడించే పరిస్థితి చూశాం. 10 ఏళ్లుగా రాజకీయ పార్టీ పెట్టిన దత్తపుత్రుడు 175 చోట్ల అభ్యర్థులను పెట్టలేని పరిస్థితిలో ఉన్నాడు. నాకు సీఎం పదవి వద్దు.. దోపిడీలో వాటా చాలని దత్తపుత్రుడు అంటున్నాడు. గజదొంగల ముఠాగా దోచుకోవడానికి వీరంతా కలుస్తున్నారు. వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారో ప్రజలు ఆలోచించాలి.

**పొత్తులు పెట్టుకుని వివాహం చేసుకునేది వీళ్లే, విడాకులు ఇచ్చేది వీరే....**

ఎన్ని వ్యవస్థలను నాపై ప్రయోగించినా 15 ఏళ్లుగా ఎక్కడా రాజీపడలేదు. ప్రజల తరపున నిలబడ్డా.. మంచి చేస్తున్నా. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తో నిలవండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి, రాష్ట్రపతిని కలిస్తే చాలు నా పై దుష్ప్రచారం చేస్తారు. బీజేపీ, కాంగ్రెస్తో అంటకాగిన వాళ్లు నన్ను దూషిస్తున్నారని విమర్శించారు. పొత్తులు పెట్టుకుని వివాహం చేసుకునేది వీళ్లేనని, విడాకులు ఇచ్చేది కూడా వీరేనని దుయ్యబట్టారు. మళ్లీ మళ్లీ పెళ్లిళు చేసుకునేది వీళ్లేనని, మ్యాచ్ ఫిక్సింగ్ కూడా వీళ్లదేనని మండిపడ్డారు.

**మత్స్య, ఆక్వారంగాలకు మంచి జరిగేలా కార్యక్రమాలు..**

జగనన్న ఇస్తున్న పథకాల ద్వారా లబ్ధిదారుల సంఖ్య 55% పెరిగింది. గత ప్రభుత్వం కంటే నాలుగు రెట్లు ఎక్కువగా జగనన్న ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గతంలో డీజిల్పై రూ.6 ఇస్తే..ఇప్పుడు రూ.9 ఇస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. వేట సమయంలో చనిపోయిన మత్స్యకారులకు రూ.10 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. గతంలో 1100 బోట్లకు సబ్సిడీ ఇస్తే..ఇప్పుడు 20 వేల బోట్లకు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు అరకొర సాయం అందేదని గత ప్రభుత్వంలో ముష్టి వేసినట్లు రూ. 4 వేలు కొంత మందికే ఇచ్చేవారని చంద్రబాబు ఐదేళ్లలో ఇచ్చింది కేవలం రూ.104 కోట్లు మాత్రమేనని గత ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు చంద్రబాబు పెట్టిన రూ.451 కోట్లతో కలిపి రూ.2792 కోట్లు విద్యుత్ సబ్సిడీ చెల్లించినట్లు తెలిపారు. గోదావరి జిల్లాలో ఫిషరీష్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని, మత్స్యకారుల వలసలు లేకుండా కొత్తగా 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 4 పోర్టుల నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ కేవలం రూ.1.50కే ఇచ్చామని తెలిపారు.

**తేడా గమనించండి....**

గతంలో పాలన చేసిన వారు, ఆ పాలకులకు మద్దతు ఇస్తున్న వారు పేదవారికి మంచి జరుగుతుంటే తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. అందుకే ఇంతగా మీ మంచి కోసం మీ బిడ్డ ప్రభుత్వానికి కేవలం తేడా గమనించమని కోరారు.

**శంకుస్థాపనలు...**

కాగా మంగళవారం దిండి గ్రామంలో 280 ఎకరాల ప్రభుత్వ భూమిలో 185 కోట్లుతో వ్యయంతో నిర్మించబోతున్న ఆక్వా పార్క్ కు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. దీని ద్వారా 21వేల మందికి ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని తెలిపారు. రూ. 417 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న ఓడరేవు ఫిషింగ్ హార్బర్ సీఎం శంకుస్థాపన చేశారు.

# ఆశ్రమాలకు తల్లి లాంటిది గృహస్థాశ్రమము

అని సూచించారు. గృహస్థాశ్రమ వైభవం ఎంతో విశేషమైనదని గృహస్థాశ్రమంలో ఉండే ధర్మాలను పాటించవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు . వివాహమంటే సంసారం కోసం కాదని భార్యాభర్తల అన్యోన్యతకు ఆదర్శానికి చిహ్నమని తెలిపారు .

భార్య భర్త కలసి జీవితకాలం ఆనందంగా జీవించినప్పుడే ఆ దాంపత్యానికి సార్థకత చేకూతుందన్నారు . ఇరుపక్షాల వారిని వారి పెద్దలని గౌరవిస్తూ జీవించాలని పేర్కొన్నారు .

తొలి రోజు కార్యక్రమాన్ని పూర్వ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్య నిర్వహణఅధికారి ఎల్వి సుబ్రహ్మణ్యం జ్యోతిని వెలిగించి ప్రారంభించగా సిఎంఆర్ గ్రూప్స్ అధినేత మాఊరి వెంకటరమణ,

పూర్వ దేవాదాయశాఖ కమిషనర్ పంచమర్తి అనురాధ, చెరువు రామకోటయ్య ఆధ్యాత్మికవేత్త ఎం.వి రాజశేఖర్, ధర్మవధిని ట్రస్టు సభ్యులు , చాగంటి సత్సంగ సభ్యులు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### అన్నదాతను ఆదుకోవాలి

సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతాంగంపై అకాల వర్షాలు గోరుచుట్టుపై రోకలి పోటుగా మారాయి. ఇటీవలికాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ మారు లక్షలాది ఎకరాల్లో రబీ సాగు తగ్గగా, నకిలీ, కల్తీ విత్తనాలు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పెట్రో ధరాఘాతం, ప్రభుత్వ నిరాదరణ.. ఈ అవాంతరాలన్నీ దాటుకొని పండించిన పంటలను భారీ వానలు ముంచెత్తాయి. ఈదురుగాలులు, వడగండ్ల దాడితో లక్షలాది ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నీటిపాలయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్ల ముందే తడిసి ముద్దవడంతో అన్నదాతల గుండె చెరువైంది. ఈ వేసవిలో కాలం కాని కాలంలో విడతలు విడతల్లో కురిసిన వర్షాలు పైర్లను ఆగమాగం చేశాయి. గడచిన రెండు మూడు రోజుల్లో పడ్డ వానలకు పొలాల్లోని పంటలు దెబ్బతినడం ఒక ఎత్తుకాగా కల్లాల్లో కోసి ఆరబెట్టిన, చివరికి మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న, మిరప, పసుపు, పత్తి, వేరుశనగ పంటలు వానలకు నానడం మరో ఎత్తు. అక్కడక్కడ మొలకలు సైతం వచ్చాయి. ఉద్యానవన పంటలు మామిడి, అరటి, బొప్పాయి, బత్తాయి తోటలు దెబ్బ తిన్నాయి. పద్నాలుగు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. పంట నష్టం భారీగా ఉంటుందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులకు ఎప్పటిదప్పుడే పరిహారం చెల్లిస్తామంటోంది రాష్ట్ర సర్కారు. ఆ విధంగా అరకొర పంపిణీ చేస్తోంది. కాగా మార్చిలో కురిసిన వానల నష్టం అంచనాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ లోపు ఏప్రిల్ 23 నుంచి రాష్ట్రంలో ఎక్కడోక్కడ వానలు పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మూడు రోజుల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఎట్టకేలకు మంగళవారం సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు తప్ప ఎలాగో స్పష్టత ఇవ్వలేదు. పొరుగు రాష్ట్ర సిఎం కెసిఆర్ చెప్పినట్లయినా ధాన్యాన్ని మామూలు ధరకు కొంటామన్న కనీస భరోసా సైతం రైతులకు జగన్ కల్పించలేదు. గతంలో విపత్తులొచ్చిన వెంటనే అధికారులు ఏయే పంటలు ఎంతెంత విస్తీర్ణంలో ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో ప్రాథమిక అంచనాలు వెల్లడించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలు నష్టపోతేనే పరిహారం ఇస్తున్నందున, అంత వరకే నష్టం జరిగిందంటున్నారు. మిగతా నష్టాలను కనీసం పరిగణనలోకి తీసుకోవట్లేదు. కౌలు రైతుల పంట పొలాలు మునిగినా అవి ఇ-క్రాప్‌లో నమోదు కావట్లేదు కనుక ఆ నష్టాలను వదిలేస్తున్నారు. ఎన్యూమరేషన్‌లో పారదర్శకత పాటించకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యేంత వరకు సమాచారం గుంభనంగా ఉంచుతున్నారు. నష్టాల వివరాలు రహస్యంగా ఉంచాలని ఉన్నతాధికారులు తాఖీదులిస్తున్నారు. లబ్ధిదారుల కోత, అనర్హుల ఎంపిక, నిధుల ఆదా కోసం ప్రభుత్వం రైతులకు అన్యాయం తలపెట్టడం క్షమించరానిది.

పంట నష్ట పరిహారం నిబంధనలు రైతులను పరిహాస మాడుతున్నాయి. కోసి ఆరబెట్టిన పంటలకు పరిహారం రాదంటున్నారు. మామిడి, బత్తాయి ఇత్యాది పండ్లు నేల రాలడం వలన రైతులకు అపార నష్టం వాటిల్లినా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వరట. పూర్తిగా చెట్లు పడిపోతేనే సహాయం. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎప్పుడో 2014లో నిర్ణయించిందే ఇప్పుడూ అమలు చేస్తున్నారు. 33 శాతం పంట దెబ్బతింటేనే ఇస్తారు. ఎకరా వరి, పత్తి, మిర్చి పంటలకు ప్రభుత్వం ఇచ్చేది రూ.6 వేలు. తోటలకైతే రూ.8 వేలు. ఈ మాత్రం దానికి పలు నిబంధనలు. కేంద్రం నిర్ణయించిన పరిహారం ఇంకా ఇంకా తక్కువ. అసలు కేంద్రం రాష్ట్రం పంపిన వినతులపై స్పందించట్లేదు. కేంద్ర బృందాలొచ్చినా నామ్ కే వాస్తే రిపోర్టులిచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. కేంద్రం కొత్తగా నిధులివ్వకుండా అడ్వాన్స్‌లు, పాత బకాయిల కింద జమ వేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం తన నిధులతో రైతులకు అరకొర పరిహారం అందిస్తోంది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు సముచిత స్థాయిలో పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి. త్వరితగతిన బీమా చెల్లించాలి. కఠిన నిబంధనలు తొలగించాలి. రంగుమారిన, తడిసిన ధాన్యం కొనుగోలుకు కేంద్రంతో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు సడలించేలా చర్యలు తీసుకోవాలి. రబీ ధాన్యం, ఇతర ప్రధాన పంటలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలి.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా టీడీపీదే గెలుపు

- మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మధురవాడ (విజయభాను న్యూస్) : జీవీఎంసీ జోన్ 2 పరిధి 8 వ వార్డు ఎండాడ శిరుగుడినగర్ లో ఉన్న పోలమాంబ అమ్మవారి పండగలకు టీడీపీ మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక నేతలు 8 వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో గంటా శ్రీనివాస్ కు స్వాగతం పలుకుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రజలకు అమ్మవారి అశీసులు ఉండాలని అన్నారు. లోకేష్ యువగళం పేరుతో జనవరి 27 కుప్పంలో మొదలు పెట్టిన పాదయాత్ర తోలి ఫేస్ లో 100 రోజులు పూర్తి చేసుకోవటం చాలా సంతోషం ఉందన్నారు. రాష్ట్రంలో ఒక ప్రక్క భానుడు భగభగలను కూడా లెక్క చేయకుండా యువగళం పాదయాత్ర అట్టహాసంగా జరుగుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు వివరిస్తు పాదయాత్రను ముందుకు సాగిస్తున్నారని, ఇప్పటికే 34 నియోజకవర్గాలలో సుమారు 1250 కిలోమీటర్లు మేర పూర్తి అయిందని అయన హర్షం వ్యక్తం చేసారు. ఇదే జోష్ తో రానున్న 300రోజుల్లో సునాయసంగా యువగళం పాదయాత్ర ను పూర్తి చేసి ప్రజల మన్నలను పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. లోకేష్ పాదయాత్ర ద్వారా గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఒక వైపు, ఈ ప్రభుత్వంలో జరుగుతున్న అవకతవకలు మరో వైపు సెల్ఫీ ఛాలెంజ్ లు ద్వారా ప్రజలను చైతన్యం పరుస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ నాయకులూ ఎన్నో రకాలుగా రెచ్చగొట్టే ప్రకటనలు, ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును టీడీపీ కైవసం చేసుకుంది అంటే ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఈ గెలుపు ద్వారా అందరూ అర్థం చేసుకోవచ్చుని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2000 నోట్లు, వెండి కాయిన్లు పంచారని, అలాగే మరికొంత మంది మంత్రులు వైసీపీ కి ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలు కట్ చేస్తాం అని ప్రలోభాలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసారు. పులివెందుల లాంటి నియోజకవర్గంలో కూడా టీడీపీ గెలుపు కైవసం చేసుకుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వానికి కౌంట్డౌన్ స్టార్ట్ అయిందని, రోజులు గడువు మాత్రమే ఉందని, ఎప్పుడెప్పుడు ఎన్నికలు జరుగుతాయా అంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చిన టీడీపీ పార్టీ గెలవడం ఖాయం అని, జీతాలు ఇవ్వలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అలాగే ఈరోజే ఎంపీ అవినాష్ రెడ్డికి సిబిఐ నోటీసులు ఇవ్వడం జరిగిందని, నాకు అనేక కార్యక్రమాలు ఉన్నాయని నేను రాలేనని చెప్పడం జరిగిందని, ఎంపీ గా రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకున్న వ్యక్తి, చట్టాలపై గౌరవం ఉన్న వ్యక్తి అయితే నిర్దోషి అయితే తన నిర్దోషత్వన్ని సిబిఐ ముందు హాజరై నిరూపించుకోవాలి తప్ప ఇలా కుంటి సాకులు చెప్పి తప్పించుకోవడం సరైనది కాదు అంటూ మండిపడ్డారు.

# ఘనంగా పరదేశమ్మ పండుగ

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు



తాటిచెట్లపాలెం(విజయభాను న్యూస్) : నగర పరిధిలోని శివశంకర్ నగర్,రజకకాలనీ పరిసర గ్రామ ప్రజల ఆరాధ్య దేవత శ్రీపరదేశమ్మ అమ్మవారి పండుగ మహొత్సవం మంగళ వారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారు జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన గావించారు. అనంతరం భక్తులకు అమ్మవారు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవార్ల ఘటాల కు ప్రత్యేక పూజలు నిర్వహించి పలు వీదుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఆయా కాలనీల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకమలు సమర్పించుకున్నారు. సాయంత్రం మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కాలనీ వాసులు బాలకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

## సమకాలీన సమయం

### సృష్టి రహస్యం

జననం మరణమైనా
శాశ్వతం అశాశ్వతమైనా
కొటీశ్వరుడు భిక్షకుడైనా
చక్రం తిప్పే నాయకుడు
పదవిచ్యుతుడై ఒంటరివాడైనా
పండుబీజమైనా
ఆకులు రాలి చెట్లకు ఎరువైనా
బిందువు వానైనా

స్త్రీ పురుష సమాగమం
బీజోత్పత్తికి అంకురమైనా
కోయిల మధుర గానమాలపించినా
అంతా సృష్టిలో అంతర్భాగమే
సృష్టికి ఎదురీదక
ఫలితాలను సంతృప్తుడై
ఆస్వాదించడమే కర్తవ్యం

కవిత రచన :
సి. ప్రతాప్

## పంచాంగం

మాసం : వైశాఖం, త్రయోదశి రా. 10.11
రేవతి ఉ. 7.55 వ.తె.3.08ల 4.40

బుధవారం
17-05-2023

a **మేషం** : ప్రముఖుల సహాయంతో ఒక సమస్య నుంచి క్షేమంగా బయట పడతారు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇతరుల విషయా లకు దూరంగా ఉండటం క్షేమదాయకం. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. b **వృషభం** :పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శు భకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల చోటు చేసుకుంటాయి. C **మిధునం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయాసలు ఎదుర్కొంటారు. స్త్రీలకు బంధువుల వైఖరి నిరుత్సాహం కలిగిస్తుంది. అవివాహితులు శుభవార్తలు అందుకుంటారు. బంధువులతో మనస్పర్థలు తలెత్తుతాయి. d **కర్కాటకం** : వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. మిత్రుల సహకారంతో కొత్త యత్నాలు మొదలెడతారు. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగస్తులు పై అధికారులను మెప్పిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అనుకూలిస్తాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి నిరుత్సాహం తప్పదు. e **సింహం** :నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం. వేడుకలు, శుభకార్యాల్లో అందరినీ ఆకట్టుకుంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. f **కన్య** :ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఎదురు చూడకుండానే మీకు కొత్త అవకాశాలు లభిస్తాయి. g **తుల** : ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కాదని గమనించండి. వస్త్ర, ఫ్యాన్సీ, మందులు, రసాయన సుగంధ ద్రవ్య వ్యాపారులకు పురోభివృద్ధి. కోర్టు వ్యవహారాలలో ప్లీడరు, ప్లీడరు గుమస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు అధికమవుతాయి. h **వృశ్చికం** :ఆలయాలను సందర్శిస్తారు. బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేయు కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. i **ధనుస్సు** :వ్యాపారాల విస్తరణలు, పరిశ్రమల స్థాపనలకు కావలసిన అనుమతులు మంజూరు కాగలవు. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతారు. గృహంలో ఒక శుభకార్యానికి అనువైన పరిస్థితులు నెలకొంటాయి. మీ విలువైన వస్తువులు, పత్రాల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. j **మకరం** :స్త్రీలకు బంధువుల రాక వల్ల ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి. పత్రిక, ప్రైవేటు సంస్థల్లోని వారికి యాజమాన్యం తీరు ఆందోళన కలిగిస్తుంది. చేతివృత్తులు, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. గృహ నిర్మాణాలు, మరమ్మతులు అనుకూలిస్తాయి. k **కుంభం** :తలచిన పనుల్లో జయం లాంటి శుభ సూచకాలున్నాయి. ఎంత ధనం వెచ్చించినా కోరుకున్న వస్తువు దక్కించుకుంటారు. స్త్రీలకు నూతన పరిచయాలు, చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. ఒక వ్యవహారం అనుకోకుండా మీకు అనుకూలిస్తుంది. L **మీనం** :ఆడిటర్లు, అకౌంట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికం. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో లౌక్యం అవసరం. నూతన పెట్టుబడులు, లీజు, ఏజెన్సీలు లాభిస్తాయి.

# సీఎం జగన్ దృష్టికి మత్స్యకార సమస్యలు



- పాకిస్తాన్ నుంచి విడుదలైన మత్స్యకారులకు పరిహారాన్ని అందిస్తాం
- సానుకూలంగా స్పందించిన సీఎం జగన్

- ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్

బాపట్ల జిల్లా (విజయభాను న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మత్స్యకారులకు అందించే వేట విరామ సమయ సమయంలో అందించే 10,000/- రూపాయల భృతిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నంలో "వైయస్సార్ మత్స్యకార భరోసా' పేరుతో అందించిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్. అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ కలిసి పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. వీటిలో ప్రధానంగా మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ గతంలో ఇవ్వవలసిన బకాయిలను విడుదల చేయాలని, ప్రమాదాలకు గురైనటువంటి ఫిషింగ్ బోట్లకు నష్టపరిహారం అందించాలని, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ లో ఆధునికరణ పనులలో మత్స్యకారులకు అవసరమైన పనులకు నిధులు మంజూరు చేసి ముందుగా చేపట్టాలని, ఐదు సంవత్సరాలుగా పాకిస్తాన్ జైల్లో జైలు శిక్ష అనుభవించి పాకిస్తాన్ నుంచి విడుదలైన మత్స్యకారులకు గతంలో ఇచ్చిన విధంగానే ఐదు లక్షల రూపాయల జీవనభృతిని అందించాలని ముఖ్యమంత్రి జగన్ని కోరడం జరిగింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ పాకిస్తాన్ నుంచి విడుదలైన మత్స్యకారులకు పరిహారాన్ని అందిస్తున్నట్లు అదేవిధంగా తక్షణమే సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరుకు వాసుపల్లి జానకిరామ్ కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందని వాసుపల్లి జానకిరామ్ తెలియజేశారు.



## గజపతినగరం ఆంజనేయ స్వామి ఆలయంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు డి.వి.ఆర్ ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న వైసిపి మండల పార్టీ అధ్యక్షులు డి.వి.ఆర్

చోడవరం (విజయభాను న్యూస్) : మండలం లోని నిత్య దూపదీపదాలతో వెలుగొందుతున్న గజపతినగరం అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో చోడవరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొడ్డి వెంకటరావు(డి.వి.ఆర్) మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దాడి సత్య నారాయణ పూజా కార్య క్రమాలు నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు.

మధ్యాహ్నం డి.వి. ఆర్ ఆర్థిక సహకారంతో ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న సమారాధన నిర్వహిం చారు. ఈ కార్య క్రమంలో అంబేరుపురం ఎంపీటీసీ సభ్యులు శరగడం లక్ష్మి నాగేశ్వర రావు, ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ళ శంకర్రావు, గౌరవ అధ్యక్షులు దొడ్డి సాయి సూరి అప్పారావు, పీలా రామప్పలనాయుడు, ఆడారి సోమేశ్వర రావు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబెడ్కర్ 132వ జయంతి మాసోత్సవాలు





**గాజువాక, విజయభాను న్యూస్** :షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ 132వ జయంతి మాసోత్సవాలు ఘనంగా ముగిసాయి. 62 వ వార్డు పరిధి ప్రకాష్ నగర్ ఏడుగుళ్ళు కూడలి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి పశ్చిమ నియోజకవర్గం ఎం ఎల్. ఏ గణబాబు, మల్కాపూరం సి. ఐ.లూథర్ బాబు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు అనంతరం కార్యక్రమంలో అధ్యక్షులు తాంబర్కా శోలే జనరల్ సెక్రటరీ గుడాల ఈశ్వర్ రావు శారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న 62,61 వ వార్డు కార్పొరేటర్ లు బల్లాలక్ష్మణ్ రావు కొనతాల సుధ ఏ. ఎం. ఎస్ అధ్యక్షులు బొడ్డు కళ్యాణ్ రావు, జె. వి.ప్రభాకర్ లు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగని నిర్మించి బడుగు బలహీన వర్గాలకోసం తన జీవితానికి త్యాగం చేసారని స్త్రీ లకు ఓటు హక్కు ఉద్యోగం హక్కు ను కల్పించిన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. అనంతరం పేదలకు చీరల పంపిణి చేశారు.

ఈ కార్యక్రమం లో సీనియర్ దళిత నాయకులు మాటూరి శ్రీనివాస్ రావు, దేవగాంధీ,కాకర రమణ,రవి సిధార్థ,బేంసెఫ్ అధ్యక్షులు ధనంజయ జై భీమ్ యూత్ సభ్యులు అనపర్తి సైదా సుదర్శన్,మాకా శాలని, మూర్ధని త్రినాథ్ బహుజన నాయకులు మూగి సూర్యనారాయణ పండు బుద్ధిస్ట్ సొసైటీ పెయ్యాలా సిధార్థ చైతన్య,శ్రీధర్ బడుగు సాయి చందు గుడాల సంధ్య, మట్టా సత్యాశీల,దోమనా లక్ష్మి వీరవేణి సంధ్య మొదలైన వారు పాల్గొన్నారు.

## రాష్ట్ర షెడ్యుల్డు కులాల కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కార్మికులు



గాజువాక (విజయభాను న్యూస్ ): హిందుస్థాన్ షిప్ యార్డ్ ఎస్సి ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యుల్డు కులాల కమీషన్ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్ను మర్యాదపూర్వకంగా కలసి షిప్యార్డ్లో నందు దీర్ఘకాళికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను విన్నవించారు.

ప్రధానంగా

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం కోసం, బ్యాక్లాగ్ సమస్యలు, ఎల్ అండ్ ఖ్యు సిరీస్ సమస్యలు,. Promotionpolicy ప్రమోషన్ పాలసీ సమస్యలపై చర్చించడం జరిగింది. షిప్యార్డ్ ను సందర్శించి మేనేజ్మెంట్ వారితో చర్చించడానికి సముఖత ను వ్యక్తం చేసినట్లు తెలిపారు. వారిని కలిసిన వారిలో

శ్రీనివాసురావు,అప్పల కొండ ,అనీల్ కుమార్, అనిల్ కుమార్.పవన్ కుమార్ కొండలరావు,సత్యనారాయణ, రవికుమర్,అప్పల రాజు, గోపాల్రావు, వెంకటప్పారావు,బుజంగరావు తదితరులు ఉన్నారు.

## ఠాగూర్ లేబరేటరీలో అస్వస్థతకు గురై బీహార్ కార్మికుడు మృతి



పరవాడ(విజయభాను న్యూస్) : పరవాడ ఫార్మసిటీలో సోమ వారం ఠాగూర్ లాబరేటరీలో తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయిన బీహార్ కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలి అని ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు ..అనారోగ్యాలతో కార్మికుల చనిపోతున్నట్లు యాజమాన్యాలు ఈ కాలంలో చెపుతున్నాయి.. మైలాన్ యూనిట్ 9 లో ఎం శ్రీను చనిపోయారు .అలాగే సోమవారం ఠాగూర్ పరిశ్రమలో ఒక కార్మికుడు చనిపోయాడు బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు చనిపోయారు కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని విధుల్లో జాయిన్ అయ్యేటప్పుడు మెడికల్ పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఉద్యోగంలో తీసుకొని తర్వాత ప్రతి ఆరు నెలలకు వైద్య పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు .కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు.. లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా గని శెట్టి సత్యనారాయణ హెచ్చరించారు..

## నేడు మాజీ ముఖ్యమంత్రివర్యులు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### నాయకులు కార్యకర్తలకు మాజీమంత్రి బండారు పిలుపు



పరవాడ(విజయభాను న్యూస్) : నేడు సాయంత్రం 6 గంటలకు నవ్యాంధ్ర సృష్టికర్త నారా చంద్రబాబునాయుడు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో భాగంగా మన పెందుర్తి నియోజకవర్గానికి వస్తున్నారని తెలిసి ఎంతో సంతోషిస్తున్నాము నియోజవర్గ టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.. దీంట్లో భాగంగా మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణమూర్తి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నేడు సాయంత్రం ఆరు గంటలకు పెందుర్తి జంక్షన్లో నారా చంద్రబాబు నాయుడు వారి అమూల్యమైన సందేశాన్ని ఇవ్వ బోతున్నారు అని అన్నారు.. కనుక ఈ సమావేశాములో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ సమావేశాన్ని దిగ్విజయం చేయాలని మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణ మూర్తి కోరారు.

## ప్రశాంతి పాలిటెక్నిక్ లో ఉచిత కంప్యూటర్ శిక్షణ




అచ్యుతాపురం, విజయభాను న్యూస్ : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంఫర్మేషన్ టెక్నాలజీ, డైరక్ట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ భారత ప్రభుత్వం వారి ఆద్వర్యంలో అబ్యర్దులకు ప్రశాంతి పాలిటెక్నిక్ లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వబడునన్నారు. అభ్యర్థులు ఇంటర్ పూర్తిచేసి ఉండాలని, 18-30 సంవత్సరాల మద్య ఉండా లన్నారు. కోర్స్ వ్యవది సంవత్సరం ఉంటుందన్నారు. ఎంపికైన అబ్యర్దులకు నెలకి రూ . 1000 స్టైపండ్ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 97012 41753 సంప్రదించాలన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉపయోగాలు

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : ప్రభుత్వ పాఠశాలలో చదివినట్లయితే చాలా ఉపయోగాలు ఉంటాయనీ తగరపువలస అంబేద్కర్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని మొకర పద్మావతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో కల్పిస్తున్న విద్యా విధానం గురించి ఉపాధ్యాయులు జి.దుర్గా ప్రసాద్,డి.వి రమేష్, వై. వెంకటేష్, లీలామణి ,కె.ఇందిర,జె.శివజ్యోతి లతో మండు టెండలో ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలనీ కోరి తల్లితండ్రులు కు అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఈ ఏడాది 10 వ తరగతి లో ప్రభుత్వ పాఠశాలలలో చదివిని విద్యార్థులు ఎక్కువగా ఉత్తీర్ణత సాధించి నట్లు చెప్పారు.కాగా అంబేద్కర్ స్కూల్ ఉపాధ్యాయుడు తన కుమార్తె ను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారనీ,తన రెండవ కుమార్తె గాదం తన్విక శ్రీ ను కూడా చేర్పించడం అభినందించ తగ్గ విషయమనీ ప్రధానోపాధ్యాయిని అన్నారు.

## మురుగు కాలువ వలన మలేరియా,టైఫాయిడ్, అంటువ్యాధులు సోకవా.?

**- పంచాయతీ కార్యదర్శి ఏమి చేస్తున్నట్లు ప్రజలు ఆరోగ్యం గురించి పట్టిందా**

**- అసలే మలేరియా జోన్ భీమవరం..!**

**- గ్రామస్తులు భాస్కర్, కృష్ణ..**



అనంతగిరి-విజయభాను న్యూస్ : మురుగు కాలువ వలన మలేరియా వచ్చే అవకాశాలు చాలా మెండుగా కనిపిస్తున్నాయి, భరించలేని వాసనాతో కుడిన ఈ కాలువ నాలుగు ఇండ్ల మధ్యలో ఉంది,మండలంలో గుమ్మకోట పంచాయతీ భీమవరం గ్రామంలో ఎం. భాస్కరరావు, జి.కృష్ణ మాట్లాడుతూ వీది కాలువతో పాటు వీది రోడ్డు సమస్య ఉంది,గత ప్రభుత్వం హయాంలో వీది రోడ్డు,వీది కాలువలు వేయడానికి సిద్దపడితే, ఈ ప్రభుత్వం హయాంలో వీది రోడ్డు అవసరం లేదు అంటూ, మేము సొంతంగా రాయి తెప్పించి వేసుకుంటాం అ ని కొంతమంది పెద్దలు మాట్లాడ్డం జరిగింది,అ పరిస్థితి ల్లో వీది రోడ్డు వీది కాలువ ఆగిపోయిందని, కొన్ని రోజుల తరువాత ఈ నాలుగు ఇండ్ల మధ్యలో గొడవలు కారణంగా పనులు నిలిచాయి,

ఈ మురుగు కాలువగా మారడానికి ప్రధాన కారణం కొంతమంది ఇంట్లో నుంచి వస్తున్నా మురుగు నీరు వలన, వర్షం పడితే కాలువ వెంట నీరు వెళ్ళేది,వర్షం లేని సమయంలో సుబ్రంగా ఉండేది,ప్రతి రోజు స్నానా లు,గిన్నెలుతోమే నీరు అలా ప్రతి రోజు వెలుతూనే ఉంది, దీని వలన చుట్టు ప్రక్కల ఇంట్లో ఉన్న వారికీ మలేరియా,డెంగూ, కలరా,వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి,సమస్య ఉన్నా చోట పంచాయతీ కార్యదర్శి ,నాయకులు రంగంలో దిగి ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చేయాలని తెలపడం జరిగింది,

నాలుగో వార్డ్ మెంబెర్ కృష్ణ వివరణ ,

వీధిలో ఉన్న వారు అందరు గొడవలు లేకుండా వీది రోడ్డు, వీది కాలువ కావాలి అంటే వార్డ్ మెంబెర్ గా నేను వెంటనే చేయిస్తాన ని కృష్ణ తెలిపారు,పంచాయతీ నాయకులు,గుమ్మకోట పంచాయతీ కార్యదర్శి సమస్యని కనులరా చుస్తే బాగుంటుంది, వారు రాకుండా చూడకుండా సమస్య నాలుగు ఇండ్ల మధ్యలో ఉంది అని తప్పించు కోవడం కాదని భాస్కర్,కృష్ణ తెలపడం జరిగింది,

ఇప్పటి కొని అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని భాస్కర్, కృష్ణ కోరుతున్నారు,

## నారా చంద్రబాబునాయుడు పర్యటన సఫలీకృతం అవ్వాలని వెంకటేశ్వర స్వామికి పూజలు



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : జీవీఎంసీ 33వ వార్డు లో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి ఆదేశాల మేరకు నారా లోకేష్ బాబు యువగలం 101 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంలో మరియు ఇదేం కర్మ కార్యక్రమనికి జాతి పార్టీ అధ్యక్షుడు విశాఖ జిల్లా మూడు రోజులు పర్యటన సందర్భంగా నారా చంద్రబాబునాయుడు పర్యటన సఫలీకృతం అవ్వాలని వెంకటేశ్వర స్వామికి పూజలు

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : టీడీపీ పార్లమెంటురి పార్టీ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి మరియు జీవీఎంసీ 33 వ వార్డు క్లస్టర్ ఇన్చార్జి మరియు టిడిపి రాష్ట్ర బిసి గవర సామాజిక వర్గం సాధికారక సమితి మెంబర్ తిరుమల దేవి చక్రవర్తి ఆధ్వర్యంలో జీవీఎంసీ 33 వ వార్డు లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ మరియు జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నాయకులు నారా లోకేష్ బాబు యువ గళం పేరుతో పాదయాత్ర ఈ సంవత్సరం జనవరి నెల 27 న రాష్ట్రవ్యాప్తంగా 400 రోజులు 4000 కిలోమీటర్లు కుప్పం నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర జైత్రయాత్ర చేస్తున్నారు కాబట్టి.. ఆ యాత్ర సఫలీకృతం కావాలని వెంకటేశ్వరా మెట్ట మీద ఉన్న వెంకటేశ్వర స్వామికి నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ బాబు పేరు మీద అభిషేకం జరిపించి, లోకేష్ 101 రోజులు పాదయాత్ర దిగ్విజయంగా నడిచినందుకు 101 కొబ్బరికాయలు కొట్టుతిరి. అలాగే నారా చంద్రబాబునాయుడు నిలి 2024లో ముఖ్యమంత్రిగా చేయాలని ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపించడం జరిగింది. అనంతరం నారా లోకేష్ యువగలం ప్లే కార్డులు పట్టుకొని పెద్ద ఎత్తున నారా లోకేష్ బాబు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్లు గందాసత్య, బూత్ ప్రసిడెంట్స్ సింగంపల్లిమాధవి, సిహెచ్ అంజలి, పొట్నూరు మీనా, ఎల్ దుర్గా, జి గుణ, ఎం యశోద, కె పావని, సబిత, ఆదినారాయణ రజిని ,కన్నారావు, పి. మీనా, పి మంగ రత్నం, గుర్నానీ భరత్ కె కొండబాబు, టి శ్రీను, ఎండి సల్మా, లక్ష్మి, ఆర్ అరుణ, వెంకటేశ్వర రావు, జానకి ,రాజేశ్వరి, పల్లవి, భాస్కర్ రావు, జోగా, ధనలక్ష్మి రజిని, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు



**ముస్లిం సంప్రదాయంతో పాటు ఆరోగ్యానికి అవసరమైన ఖత్నా ఉచిత వైద్యాన్ని 200 మంది చిన్నారులకు అందించడం జరుగుతుందని సీరత్ కమిటీ అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్ లతీఫ్, హాజీ ఎన్. కే అహ్మద్ వలి తెలిపారు. దొండపర్తి లో గల సింకా గ్రాండ్స్ లో కాంగ్రెస్ నాయకులు ముస్లిం పెద్దలు హైదర్ అలీ సింకా సహకారం మరియు మరి కొంతమంది పెద్దల ఆర్థిక సహాయ సహకారాలతో ప్రతి ఏటా ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అలాగే ఖత్నా అనంతరం వాడే మందులు, భోజన సదుపాయం, రవాణా ఖర్చులు ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి జనాబ్ మహబూబ్ షరీఫ్ , ట్రెజరర్ జనాబ్ ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.**

# నాడు నేడు పాఠశాలల పనితీరు పై సుడిగాలి పర్యటన చేసిన సర్వ శిక్ష అభియాన్ డిఈఈ



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : నాడు నేడు పాఠశాలల పనితీరు పై సుడిగాలి పర్యటన చేసిన సర్వ శిక్ష అభియాన్ డి.ఈ, నరసింహారావు సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నాడు నేడు పాఠశాల పనితీరుపై భీమిలి మండల విద్యాశాఖాధికారిణి కె. అమృత. బాలామణి, సర్వ శిక్ష అభియాన్ డి.ఈ లు ప్రాథమిక పాఠశాలలు గొల్లల తిమ్మాపురం, చేపల తిమ్మాపురం, మంగమారిపేట, యాతపేట, గొల్లల తాళ్లవలస, సిటీ నగర్, జీరుపేట, చిప్పాడ, పాత మూలకుద్దు , అంగన్వాడి కేంద్రం ఆసిపాలెం అదేవిధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మంగమారిపేట, తాళ్లవలస, చిప్పాడ, అమనాం మరియు ప్రాథమికోన్నత పాఠశాల పెదనాగమయ్యపాలెం లను పర్యటించి నాడు-నేడు లో భాగంగా మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ పనులు, ప్రహరీ గోడ, త్రాగునీరు సౌకర్యం, వంట గదుల నిర్మాణం, గ్రీన్ బోర్డులు తదితర అంశాలను పరిశీలించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రివాల్వింగ్ ఫండ్ అంతా ఖర్చు పెట్టమని తెలియజేశారు. అవసరమైతే రివాల్వింగ్ ఫండ్ విడుదల చేస్తామని తెలియజేశారు.పాఠశాలలు జూన్ 12వ తేదీ కల్లా తెరిచేలోపు నాడు నేడులో భాగంగా ఉన్న అన్ని పనులు పూర్తి చేయమని ఆదేశించారు. సంబంధిత ఇంజనీర్ అసిస్టెంట్లు పిలిపించి పనులు మరింత వేగవంతంగా చేయమని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆగకుండా జూన్ 12 పాఠశాలలు తెరిచేసరికి నాడు నేడు పనులు పూర్తి కావాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తారని తెలియజేశారు. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుండి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటన ఉంటుందని ప్రతి ఒక్కరు రికార్డులు సిద్ధం చేసుకోవాలని తెలియజేశారు.

# ఘనంగా కుంచమాంబ అమ్మవారి పండగ



గాజువాక (విజయభాను న్యూస్) : గాజువాక ప్రజల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ కుంచమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అసౌకర్యం కలక్కుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ నర్సింగరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ పరిపాలన భవనాన్ని

# ముట్టడించిన కార్మిక సంఘాలు





గాజువాక (విజయభాను న్యూస్) : విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు కదం తొక్కారు. సెయిల్ తో సమానంగా వేతన సవరణ ఒప్పందం అమలు చేయాలంటూ పరిపాలన భవనం ముట్టడికి దిగారు. మంగళవారం నుంచి పరిపాలన భవనానికి వెళ్లే అన్ని రహదారుల పైన కార్మికులు బైఠాయించారు. ఈ క్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ఉద్రిక్త పరిస్థితుల నెలకొన్నాయి. పరిపాలన భవనానికి వెళ్లే అన్ని రహదారులపై బైఠాయించి.. వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో భారీగా మోహరించిన పోలీసులు కార్మికులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఉక్కు కార్మికులకి ఆరు సంవత్సరాలుగా వేతన సవరణ ఒప్పందాన్ని అమలు చేయకపోవడాన్ని వారు తీవ్రంగా నిరసిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అది అమలు చేయకపోవడాన్ని వారు తీవ్రంగా నిరసిస్తున్నారు. తమకున్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అది అమలుచేయకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామనిహెచ్చరించారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు రోడ్డుపై బైఠాయించినిరసన తెలియజేయడంతో ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనాలరాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉక్కు యూనియన్ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ ఉక్కు కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజల్లో చైతన్యం తెస్తున్న చిన్నారి ట్వింకిల్




శ్రీకాకుళం, విజయ భాను న్యూస్ : చిన్నతనం నుండే ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రత్యక్షంగానే కాకుండా, పరోక్షంగా చేస్తూ రవీంద్రభారతి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతూ పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజల్లో చైతన్యం తెస్తున్న విధానం అందరిని ఆచ్చర్యపరుస్తుందని, చిన్నారి సామాజిక సేవలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీకాకుళం ఇండియన్ ఆర్మీ కాలింగ్ ప్రిన్సిపల్ వెంకట రమణ అన్నారు. స్థానిక 80 అడుగుల కూడలిలో ఆనుకొని ఉన్న ఆటస్థలంలో చిన్నారులు, యువకులు, పెద్దలు ప్రకార్డులను పట్టుకొని మరీ అందరిని ఆలోచింపజేసే విధంగా తమ వంతు కృషి చేశారు. మాస్క్ ను ధరించండి - కరోనాను జయించండి, హెల్మెట్ ధరించండి - ప్రమాదాలు నివారించండి, నిదానమే ప్రధానం, రక్త దానంతో ప్రాణాలు కాపాడుదాం, పేద వారికి మీకు తోచిన సాయం చెయ్యండి అంటూ తమదైన శైలిలో ప్రజలను చైతన్య పరిచారు. అనంతరం వన్ టౌన్ ఎస్.ఐ. మొజ్జాడ ప్రవళ్ళిక మాట్లాడుతూ యువత చదువును వదిలి, చెడు వ్యస నాలకు లోనవుతున్నారని, అమ్మాయిల వలలో పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాగే వాహనాలను నడిపే టప్పుడు అతివేగమే కారణంగా ప్రమాదాలను కోరి తెచ్చుకోవ టమే కాకుండా, ప్రమాదాలకు ఇతరులని కూడా బలి చేస్తు న్నారని, నిదానమే ప్రధానమన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా , ఇంటికి సురక్షితంగా చేరుకోవాలని, కన్న తల్లితండ్రులను ఇబ్బంది పెట్టకుండా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. అనంతరం చిన్నారిని, బి.వి. రమణను, వన్ టౌన్ ఎస్.ఐ. లను స్వచ్ఛంద సమస్త సభ్యులు సత్కరించారు.

# భీమిలి జోనల్ కార్యాలయం ఎదుట ఆర్పీలు ధర్నా



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : యూజర్ ఛార్జీలు వసూలుకు వెళితే తమ దగ్గర అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని భీమిలి జోనల్ కార్యాలయం ఎదుట ఆర్పీలు ధర్నా చేసారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ...

యూజర్ చార్జీలు వసూలు చేయడానికి ఈనెల 12 న మామిడిపాలెం కు చెందిన ఆర్పీ యూజర్ ఛార్జీలు వసూలు చేయడానికి ఒక ఇంటికి వెళ్ళి అడగ్గా అక్కడ సభ్యురాలి భర్త త్రినాథరావు అనే క్లాప్ డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించారనీ అన్నారు. ఆవ్యక్తి పై చర్యలుతీసుకోవాలని, తమకు క్షమాపణ చెప్పాలని, యూజర్ ఛార్జీలు వసూలు చేయడం వంటివి తమను తప్పించాలని తదితర విషయాలపై డిమాండ్ చేసారు. ఈ మేరకు భీమిలి జోనల్ కమీషనర్ రాముకు వినతిపత్రం అందజేశారు.

# రోడ్డు ఆక్సిడెంట్స్ పై అవగాహన కార్యక్రమం

## ముఖ్య అతిథిగా డి.ఎస్.పి సత్యనారయణ



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ డీఎస్పీ సత్యనారయణ కార్యాలయం నందు డీఎస్పీ ఆధ్వర్యములో బస్ అండ్ లారీ ఓనర్స్ కి రోడ్ ఆక్సిడెంట్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. రోడ్డు ప్రమాదాలు ఎలా తగ్గించాలో అనే వాటిపై అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు..ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాన్ని నడిపేటప్పుడు మద్యం సేవించి మరియు సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపు రాదన్నారు.

అతివేగం అనేక అనార్థాలకు దారితీస్తుంది అన్నారు.. బస్సు మరియు లారీ ఓనర్లకు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో పరవాడ సీఐ పెద్ది రెడ్ల ఈశ్వరరావ్ తో పాటు పలువురు అధికారులు సీఐలు ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట



కాకినాడ, విజయభాను న్యూస్ : కాకినాడ జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. కలెక్టరేట్ వివేకానందహాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన నార్కో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్, రవాణా, ఔషధ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ శాఖల అధి.కారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయిని వినియోగించే వారి నుంచి సమాచారాన్ని సేకరించడం ద్వారా పెడలర్లను గుర్తించి ఉత్పత్తి, రవాణా, వినియోగం ఈ మొత్తం సరఫరా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు వీలవుతుందన్నారు. సమాచారం అందించేందుకు 14500 టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోనూ ఈ నంబరును ప్రదర్శించాలన్నారు. జీజీహెచ్‌లోని డీ-అడిక్షన్ కేంద్రం తమ కేంద్రాల్లో చికిత్స తీసుకుంటున్న వారి వివరాలను పోలీసు శాఖకు అందించా లన్నారు. సెర్చ్ అండ్ సీజ్ ఆపరేషన్స్‌లో సమన్వయ శాఖల అధికారులు భాగస్వాములు కావాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని విద్యా సంస్థలు, హాస్టళ్లు తదితరాల్లో ఆకస్మిక తనిఖీలకు మండల స్థాయిలో తహసీల్దార్ కన్వీనర్‌గా విద్యా సంస్థల ప్రతినిధులు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌తో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడిం చారు. ఈ కమిటీలు జిల్లాస్థాయి నార్కో సమన్వయ కమిటీ సమావేశాల తరహాలోనే మండల స్థాయిలోనూ ఎప్పటికప్పుడు సమావేశమయ్యేలా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్య, రైల్వే పోలీస్, అటవీ, ఏపీఎస్ ఆర్టీసీ, పోర్టు, వ్యవసాయం, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, హౌటళ్లు, లాడ్జుల అసోషి యేషన్లు, పార్సిల్, కొరియర్ సర్వీసు అసోసి యేషన్ల ప్రతి నిధులకు గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ డా. కతికా శుక్లా మార్గనిర్దేశనం చేశారు.ఎస్పి ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సరైన సమన్వయంతో పనిచేయడం ద్వారా జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. ఏదో ఒక శాఖ ద్వారా లక్ష్యాలను చేరుకోవడం కష్టమని.. సమన్వయ శాఖల సమష్టిగా విద్యా సంస్థల పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచామని.. రాత్రిపూట రైడ్‌లను ముమ్మురం చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే రహదారుల వెంబడి తనిఖీలు నిర్వహణతో గంజాయి రవాణాను అడ్డుకోవచ్చన్నారు.

# గిరిజన యూనివర్శిటీ స్థలాన్ని సిద్ధం చేయండి

## జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం, విజయ భాను న్యూస్ : కేంద్రీయ గిరి జన విశ్వవిద్యాలయం కోసం మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సేకరించిన స్థలాన్ని అప్పగించడానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ట్రైబల్ యూనివర్సిటీ స్థలంలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి, తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విశ్వ విద్యా లయం కోసం రెండు మండలాల్లోని చినమేడపల్లి, మర్రివలస గ్రామాల పరిధిలో మొత్తం 561.891 ఎకరాల భూమిని సేకరించినట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చెప్పారు. భూసేకరణకు సంబంధించి నష్టపరిహారం దాదాపు పూర్తి అయ్యిందని, చెట్లకు సంబంధించి మాత్రమే బిల్లులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, సేకరించిన స్థలంలో రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయాన్ని కల్పించేందుకు తక్షణమే పనులను ప్రారంభిం చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమికంగా విద్యుత్ సరఫరా కోసం మంజూరైన రూ.48 లక్షలతో పనులను మొదలు పెట్టా లన్నారు. అడ్డుగా ఉన్న రెండు విద్యుత్ టవర్లను తొలగించాలని ఎపి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సుమారు రూ.16 కోట్లతో ప్రతిపాదించిన ఆరులైన్ల రహదారి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. నీటిసరఫరా కోసం రూ.7కోట్లతో ప్రతిపాదించిన పనులను ప్రారంభించాలని, రక్షిత నీటి పథకంతోపాటు, ఐదు బోర్లు వేసే పనులను కూడా వెంటనే ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ను కలెక్టర్ ఆదేశించారు. ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టమణి మాట్లాడుతూ, ఈ యూనివర్సిటీ రాష్ట్ర విద్యార్థులకు ఒక వరం లాంటిదని పేర్కొన్నారు.

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్య ఇక్కడి విద్యార్థులకు అందు బాటు లోకి వస్తుందన్నారు. సమావేశంలో డిఆర్ఓ ఎం.గణపతి రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమాశంకర్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ నాగేశ్వర్రావు, ఆర్అండ్‌బి ఇఇ రమణ, ట్రాన్స్‌కో ఇఇ శ్రీచరణ్, కలెక్టరేట్ జి. సెక్షన్ సూపరింటెండెంట్ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో 1300 ఇళ్లు పూర్తి కావాలి

- మూడో ఆప్షన్ కింద నిర్మిస్తున్న గృహాలపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు
- గుంకలాం, కొండకరకాం లే అవుట్ లు సందర్శన
- పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులను రప్పించాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలు

విజయనగరం(విజయభాను న్యూస్): నగరంలోని ఇళ్లులేని నిరుపేదల కోసం గుంకలాం, కొండకరకాం గ్రామాల వద్ద రూపొందించిన గృహ నిర్మాణ లే అవుట్లలో వచ్చే రెండు నెలల్లో 1300 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. గుంకలాం లో 1000, కొండ కరకాంలో 300 పూర్తిచేయాలని ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రైవేట్ నిర్మాణ సంస్థ ప్రతినిధులకు స్పష్టం చేశారు. మూడో ఆప్షన్ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణం లో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే రెండు నెలల కాలంలో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులను రప్పించాలని, పునాది స్థాయికి మరో 1000 ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో గుంకలాం, కొండకరకాంల వద్ద గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన లే అవుట్ లను కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా అక్కడ జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై సంస్థ





ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణమూర్తి, డి.ఇ.లు, ప్రైవేట్ నిర్మాణ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. గుంకలామ్ లో 8000, కొండ కరకాం లో 2000 ఇళ్ల నిర్మాణం ఆప్షన్ -3 కింద రాక్రీట్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతోందని పి.డి. రమణ మూర్తి వివరించారు. నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇటుకల తయారీ కూడా అవసరం మేరకు జరుగుతోందన్నారు. తగినంతగా భవన నిర్మాణ కార్మికులు లేకపోవడం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చే వారం రోజుల వ్యవధిలో కార్మికులను రప్పించి పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిర్మాణ సంస్థ తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణానికి అవసరమైన నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజారోగ్య ఇంజనీరింగ్ ఇ.ఇ. దక్షిణామూర్తి నీ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం కోసం చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని గృహనిర్మాణ సంస్థ పి.డి. ని ఆదేశించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇటుకల తయారీ యూనిట్ ను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు ఎన్ని వేల ఇటుకలు తయారు చేస్తున్నదీ, ఎందరు వర్కర్ లు యీ యూనిట్ లో పనిచేస్తున్నది తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ కొండ కరకం లే అవుట్ సందర్శించారు. ఈ పర్యటనలో గృహ నిర్మాణ సంస్థ డి.ఇ.లు రంగారావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.



# పద్మావతిని అభినందించిన రియాజ్ ఖాన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నవ యువ ముఖ్యమంత్రి జననేత జగనన్న ఆశీస్సులతో వైఎస్ఆర్సిపి మహిళా విభాగం జోనల్ ఇన్చార్జిగా నియమితులైన బెందాళం పద్మావతిని తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని హృదయపూర్వక అభినందనలు తెలిపిన బొబ్బిలి పురపాలక సంఘ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్.

# నాడు-నేడు పనుల్లో జాప్యం వద్దు


## జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

శ్రీకాకుళం : జిల్లాలో జరుగుతున్న రెండవ విడత నాడు - నేడు పనుల్లో జాప్యం జరిగితే సహించబోమని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. లక్ష్యాలను నిర్దేశిస్తూ గతంలో పలు సమావేశాలు నిర్వహించి నప్పటికీ మరలా పలు మండలాలు వెనుకంజలో ఉండటంపై కలెక్టర్ మండిపడ్డారు. జూన్ 12 నాటికి పనులు పూర్తికావాలని ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించినందున, ఆ సమయానికి లక్ష్యాలు సాధించాల్సిందేనని కలెక్టర్ తేల్చిచెప్పారు. అప్పటికి ప్రగతిని కనబరచని అధికారులపై వేటు తప్పదని అన్నారు. ప్రగతిని కనబరచడంలో నిర్లక్ష్యం, నిర్లిప్తత వహించిన హిరమండలం మండల విద్యాశాఖాధికారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. నాడు-నేడు రెండవ విడత పనులపై మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఎం.ఈ.ఓలు, ఏ.పి.ఎంలు, సి.డి.పి.ఓలు, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు-నేడులో నిధులు మంజూరైనప్పటికి పనులు చేపట్టని సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అన్నారు. కొన్ని మండలాల్లో మంజూరుచేసిన నిధుల కంటే అధికంగా నిధులు ఖర్చు చేసి శత శాతానికి పైగా పనులు పూర్తి చేయగలిగారని, అటువంటి పరిస్థితులే అన్ని మండలాల్లో ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందని కలెక్టర్ ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉపేక్షించేది లేదని, మండలంలో జరగాల్సిన పనులపై సంబందిత అధికారులందరూ సమావేశమై ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

# ఏపీలో స్టార్టప్ లకు భారీ ప్రోత్సాహం

- సముద్రంపై వేట నిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా
- అత్యధిక మహిళా పోలీసులున్న రాష్ట్రం ఏపీ
- సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

## ఎంపి( రాజ్యసభ) విజయసాయిరెడ్డి



అమరావతి (విజయభాను న్యూస్): రాష్ట్రంలోని స్టార్టప్ లన్నింటికి ఒకే చోట అన్ని పరిష్కారాలు లభించేలా ఏపీ స్టార్టప్ డాట్ ఇన్ పేరుతో ప్రత్యేకంగా ఒక పోర్టల్ ఏర్పాటు చేయ్యడమే కాకుండా వాటికి అవసరమైన నిధులను సమకూర్చేవిధంగా ఇన్నొవేషన్ ఫండ్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని రాజ్యసభ సభ్యులు,వైఎస్ఆర్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు అంశాలపై స్పందించారు. ప్రారంభంలో రూ.200 కొట్ల నిధులతో స్టార్టప్ లకు ఆర్థిక సాయం అందిచనున్నారని తెలిపారు. విశాఖలో ఏడు స్టార్టప్ లకు సాయానికి సంప్రదింపులు చేసినట్టు ఆయన చెప్పారు.

**వైఎస్సార్ మత్స్యకార భరోసా.....**

రాష్ట్ర వ్యాప్తంగా సముద్రంపై వేటకు వెళ్లే 1,23,519 మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ సమయం అయిన ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 మధ్య కాలంలో ఆ కుటుంబాలు ఇబ్బంది పడకూడదని ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున రూ.123.52 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జగన్ మొహన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారని చెప్పారు.

**అత్యధిక మహిళా పోలీసులున్న రాష్ట్రం ఏపీ....**

ఆంధ్రప్రదేవ్ దేశంలోనే అత్యధిక మహిళా పోలీసులున్న రాష్ట్రంగా నిలిచిందని ఆయన అన్నారు.జాతీయ స్థాయిలో 11.75 శాతం మహిళా పోలీసులుంటే ఏపీలో అది 21.76%. ఇవి కేంద్ర హోంశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయని చెప్పారు. మహిళా సాధికారితలోనూ దేశంలో మనమే నంబర్ వన్ నిలిచామని చెప్పారు.

**సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి....**

భారతదేశంలో వ్యవసాయ విధానంలో సానుకూల మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన అన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అనవసర వినియోగాన్ని నివారించాలని కొరారు. ఆరోగ్యకరమైన మరియు లాభదాయకమైన వ్యవసాయ పద్ధతుల పునరుద్ధరణ దిశగా వ్యవసాయ మంత్రిత్వ శాఖ చొరవ తీసుకోవాలని కోరారు.గత 3-4 దశాబ్దాల్లో ఆహార పదార్థాల్లో పోషకాలు తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది. మాంసకృత్తులు, కాల్షియం, భాస్వరం, రిబోఫ్లావిన్ మరియు విటమిన్ సి ఇప్పుడు తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలలో అందుబాటులో లేవని శాస్త్రీయ అధ్యయనాలు చూపించాయన్నారు.

# అందరూ పాస్ అయ్యేలా కృషి చేయండి

- మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టండి
- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ సమీక్ష



విజయనగరం (విజయభాను న్యూస్) : ఇటీవల జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అత్యంత శ్రద్ధ వహించి అందరూ పాస్ అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ విద్యాశాఖ పరిధిలోని వివిధ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నింపి ఈ నెల 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా వృత్తి విద్యా అధికారి, గురుకులాల జిల్లా కో.ఆర్డినేటర్, ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సమన్వయ అధికారులతో ఆమె తన చాంబర్లో మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహిం చారు.మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పేర్కొంటూ పలు సూచనలు చేశారు. అన్ని రకాల వసతులను సమకూరుస్తూ సబ్జెక్ట్ నిపుణుల చేత ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో విశ్వాసం నింపాలని సూచించారు. దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులను వారికి సమీపంలో ఉన్న స్టడీ కేంద్రాలకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ కమ్ కాలేజెస్ ఉన్న చోట అస్సలు ఫెయిల్ కావడానికి వీలు లేదని.. ఉత్తమ ర్యాంకులు సాధించేలా శ్రద్ధ వహించాలని చెప్పారు. తరగతులతో పాటు విద్యార్థులతో ఆటలు ఆడించాలని సూచించారు. అందరూ సమన్వయ కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ నిర్దేశించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో మౌలిక వసతులు, సదుపాయాలపై ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి సురేష్ కుమార్, గురుకులాల జిల్లా కో.ఆర్డినేటర్ చంద్రావతి, తాటిపూడి ఏపీఆర్జేసి కళాశాల ప్రిన్సిపాల్ శారదా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలి

శ్రీకాకుళం : సమాజంలో ఆడ, మగ అనే లింగబేధం ఉండరాదని రెవెన్యూ డివిజినల్ అధికారి బి.శాంతి అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్.డి.ఓ ఛాంబర్ లో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) చట్టం పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం రెవెన్యూ డివిజినల్ అధికారి అధ్యక్షతన జరిగింది. రెవెన్యూ డివిజినల్ అధికారి మాట్లాడుతూ కేంద్రాలలో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలనీ, ఆన్లైన్లో అప్లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల బాలికలు ఇద్దరూ సమానమే అని ప్రతి ఒక్కరూ గ్రహించాలని తెలిపారు.

# బాలికల పట్ల వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తేవాలి

శ్రీకాకుళం : లింగ నిర్ధారణ పరీక్షలు వెల్లడించడం నేరం అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.బి.మీనాక్షి మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశమందిరంలో గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) చట్టం పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి అధ్యక్షత వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలలో సి.సి కెమెరాల ఏర్పాటు, ఆన్లైన్లో అప్లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల బాలికలు ఇద్దరూ సమానమేనని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చెప్పారు. బాలికలు ఎందులోనూ తక్కువగా చూడవలసిన అవసరం లేదన్నారు.

# నేర నియంత్రణలో ఆటో కార్మిక సంఘాలు, ఆటో డ్రైవర్లు సహకరించండి



విశాఖ క్రైమ్ (విజయభాను న్యూస్) : నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.యం.త్రివిక్రమ వర్మ, డి.సి.పి-01 (ఎల్ & ఓ),డి.సి.పి(క్రైమ్స్), ఏ.డి.సి.పి(ఎస్.బి) , ఏ.డి.సి.పి(ట్రాఫిక్), నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు ఆటో డ్రైవర్లతో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని, సత్వరం వారి సమస్యలు తీరే విధముగా తగు ప్రణాళికలను రూపొందిస్తామని, అదే విధంగా నేరాల నియంత్రణలో వారి తోడ్పాటు అందించడంతో పాటుగా స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంలో ఉండేలా పలు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ -1, ట్రాఫిక్ ఏసీపీ -2 తో పాటుగా పలు పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు మరియు ఐ ఎన్ టి యు సి ఆటో యూనియన్,సీఐటీయూ ఆటో యూనియన్ జనరల్ సెక్రెటరీ , ఏఐటీయూసీ ఆటో యూనియన్ జనరల్ సెక్రెటరీ , ఏఐటీయూసీ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మొదలగు వారు పాల్గొన్నారు.



బాపట్ల జిల్లా, నిజాంపట్నంలో నిర్వహించిన వైఎస్ఆర్ మత్స్యకార భరోసా కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని హెలిప్యాడ్ వద్ద మర్యాద పూర్వకంగా కలుసుకున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు.

# ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

- దయాగ్నస్టిక్స్ సెంటర్లలో ఐఇసి బోర్డ్స్, ధరల పట్టిక ప్రదర్శించాలి
- నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వర రావు





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు తమ సిబ్బందితో కలిసి మహారాణిపేట లో గల లయ డయాగ్నోస్టిక్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో స్కాన్ సెంటర్ దగ్గర మరియు రిసెప్షన్ దగ్గర ఐ ఈ సీ బోర్డ్స్ లేవని గుర్తించి తక్షణమే ఐ ఈ సీ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, ధరల పట్టిక ను ప్రదర్శించాలని, ఫారం-ఎఫ్ పూర్తిగా నింపాలని పలు సూచనలు చేశారు. పేదవారికి ఫీజులు తగ్గించి పరీక్షలు నిర్వహించాలని తెలియచేశారు. తదుపరి సీబీఎం కాంపౌండ్ లో గల విశాఖ ఇ.ఎన్.టి ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ ఆసుపత్రిలో అవసరమైనటువంటి డాక్టర్స్ మరియు సిబ్బంది అర్హతలు కలిగి ఉన్నారని మరియు ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలదని మరియు ఆసుపత్రి రిజిస్ట్రేషన్ కి సంబందించిన అన్ని ధ్రువ పత్రములు కలవని, ఆసుపత్రి యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. పేదవారిని దృష్టి లో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని, రుసుములు సంబందించిన ధరల పట్టిక మరియు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ లు ఆసుపత్రి రిసెప్షన్ విభాగం లో ప్రదర్శించాలని ఆదేశించారు. ఇంకా చాలా హాస్పిటల్స్, క్లినిక్స్, ల్యాబ్స్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ https://clinicalesttact.ap.gov.in మరియు స్కానింగ్ కేంద్రములు http://pcpndt.ap.gov.in లో చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భన లో డిపీఎంఓ - ఎన్ హెచ్ ఎం డా.ఎన్.రమారెడ్డి, బి.నాగేశ్వర రావు, డెమో, ఎల్.కోటేశ్వర రావు, పోజేక్షనిస్ట్, నాగభూషణం ఎంపీహెఈఓ పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ పనులపై జివిఎంసి కమిషనర్ సమీక్ష

విశాఖపట్నం : స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ జివిఎంసి అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నగరంలో ఇప్పటివరకు చేపడుతున్న స్మార్ట్ సిటీ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని కొన్ని సూచనలు చేశారు.

నగరంలో స్మార్ట్ సిటీ ద్వారా ప్రధాన ప్రాజెక్టులతో పాటు రోడ్లు, ప్రధాన జంక్షన్లు ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ స్థలాలు, ఫుడ్ కోర్ట్ లు ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు రోడ్లు, ఫుట్ పాత్ లు లాంటి పనులు ప్రజలకు ఇబ్బంది కలగాకుండా చేయాలన్నారు. అలాగే స్మార్ట్ సిటీ పనులు ఏ విధంగా చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజెంట్ చేయాలని స్మార్ట్ సిటీ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జివిఎంసి ప్రధాన ఇంజనీర్ రవికృష్ణ రాజు, పట్టణ ప్రణాళిక అధికారి బి సురేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు రవి, గోవిందరాజు, డిడిహెచ్ దామోదర రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు, స్మార్ట్ సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సు కోరుకునే వ్యక్తి

- 53వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కె.కె రాజు



మర్రిపాలెం (విజయభాను న్యూస్): గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమంలో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం 53వార్డు మహారాణివీధి-1 సచివాలయం 1086297 పరిధి మోహిద్దీన్ గార్డెన్స్ ప్రాంతంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు, 53 వ వార్డు కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలీ తో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి వెళ్ళి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొండవాలు,మురికివాడ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా వై.యస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు సచివాలయాలు ద్వారా కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో ఆయా లబ్ధిదారులకు విశిష్టమైన సేవలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి,యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ యం.సునీల్,ఎయిర్ పోర్టు అడ్వైజర్ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు,జేసీఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి,53వ వార్డు నాయకులు షేఖ్ బాబ్జి, హనుమంతు,జ్ఞానేశ్, సుశీల, జోస్న,కనకరాజు, క్రిష్ణ,సూర్య,గిరీష్,సుజాత,జయ,లక్ష్మీ,మంగ,సీనియర్ నాయకులుచిరంజీవి, హరిపట్నాయక్ ,కె.చిన్నా,వెంకటేష్, జీవీఎంసీ అధికారులు,సచివాలయం సిబ్బంది,వాలంటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య నిర్వహణ బాధ్యత శానిటేషన్ కార్యదర్శులదే

- జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ



విశాఖపట్నం, **(విజయభాను న్యూస్)** : పారిశుధ్య నిర్వహణ బాధ్యత సచివాలయ శానిటరీ కార్యదర్శులదేనని జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జివిఎంసి విఎంఆర్డిఏ చిల్డ్రన్ ఎరేనా థియేటర్ నందు శానిటేషన్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ బాధ్యత సచివాలయ శానిటరీ కార్యదర్శులదేనని, పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసుకొని అందరూ పని చేసే విధంగా చూడాలన్నారు. సచివాలయ పరిధిలో కార్యదర్శిలే ముఖ్యమైన వ్యక్తులని, సచివాలయ పరిధిలో వ్యర్థాలు లేకుండా చూడవలసిన బాధ్యత కార్యదర్శిలదేనని, శానిటేషన్ కార్యదర్శులందరూ ఉదయం 5.30 గంటల నుండి విధులలో ఉండాలన్నారు. విశాఖ నగరాన్ని డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు మీ అందరి కృషి అవసరం అన్నారు. నగరంలో ప్రతి దుకాణదారుడు తమ దుకాణం ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించడంతోపాటు, చెత్తను జివిఎంసి వాహనానికి అందించేలా చూడాలన్నారు. డోర్ టు డోర్ చెత్త నిర్వహణ యాప్ ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలని, వార్డులో పందులు నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించి పందులను షూటర్ల తో వాటిని సమూలంగా నిర్మూలించాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధవహిం చాలని ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయాల పరిధిలో భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నట్లయితే ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడి వాటిని తొలగించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం యూజర్ చార్జీలు వసూలుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కార్యదర్శులకు ఆదేశించారు. వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రధాన గెడ్డలతో పాటు మైనర్ గెడ్డలలోని పూడికలు తీయించాలని అధికారులను ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" నిర్వహించడంతో పాటు ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజా మరుగుదొడ్లతో పాటు కమ్యూనిటీ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, జోనల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్ లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లూఫ్లాగ్ తో విశాఖ తీరప్రాంతాలకు గుర్తింపు

## గీతం సదస్సులో నిపుణుల వెల్లడి



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్)** : విశాఖ తీరప్రాంతం ముఖ్యంగా రుషికొండ తీరానికి బ్లూఫ్లాగ్ లభించడం పర్యాటకులను మరింతగా ఆకర్షించగలదని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్రవిభాగం మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన సదస్సులో నిపుణులు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ 1987 సంవత్సరంలో యూరప్ లో బ్లూఫ్లాగ్ మొదటి సారిగా ప్రారంభించారని తదనంతర కాలంలో దాదాపు48 దేశాలలో ఐదు వేలకు పైగా బీచ్ లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు లభించిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజనీర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరిబాధ్యత అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధిశాఖ ప్రాంతీయ డైరక్టర్ డాక్టర్ శ్రీనివాసఫణి తన ప్రసంగంలో తీరప్రాంత పర్యాటకం అభివృద్ధిలో బ్లూఫ్లాగ్ ప్రాధాన్యతను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, పర్యావరణ శాస్త్రవిభాగం అధిపతి డాక్టర్ వి.సరిత, కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com